## క్లుప్తంగా

### ఆలయ చైర్మన్ 'జంగాల' బాధ్యతల స్వీకరణ



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జంగాల శ్రీనివాసరావు (వాసు) శుక్రవారం ఆయన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. వేదపండితులు, అర్చకులు ఆయనకు ఆశీర్వచనం ఇచ్చారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మొదటిసారి బీసీవర్గానికి చెందిన తనకు ఆలయ చైర్మన్‌గా అవకాశం కల్పించారంటూ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాలకవర్గసభ్యులతో కలిసి ఆలయ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వివరించారు.

### వైభవంగా క్రీస్తు ఆరాధన



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు):గ్రామంలోని ప్రసిద్ధ లూర్ధుమాత ఆలయంలో శుక్రవారం తెల్లవారు జామున ఆరాధన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆగమనకాలం సందర్భంగా ఫాదర్ దేవకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై దీపాలు వెలిగించారు. ఈసందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ 22రోజులుగా ఈ దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, శనివారంతో ముగుస్తుందని వివరించారు.

### ఈవీఎంల పనితీరుపై అవగాహన



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరు ఓటును సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి బి.జ్యోతిబ్రహ్మం సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సర్పంచి జ్యోతిబ్రహ్మం మాట్లాడుతూ ఓటు ప్రజల చేతిలో వజ్రాయుధం వంటిదన్నారు. ఈవీఎం ద్వారా ఓటు వేసేందుకు నూతన ఓటర్లు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామ నాయకులు గంగూరి ప్రసాద్, సయ్యద్ జాన్‌మియా, వూట్ల లక్ష్మయ్య, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో జాగరణ కార్యక్రమం



పెనుగంచిప్రోలు: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద భజన బృందాలచే భజనా కార్యక్రమం, జాగరణ నిర్వహించారు. ముందుగా ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఉమాపతి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అందంగా అలంకరించిన అరటి మండలపాలపై స్వామివార్లను ఉంచి కళాకారులచే భజనా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### నూతన వస్త్రాల బహూకరణ



జగ్గయ్యపేట అర్బన్: క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సెయింట్ ఆన్స్ హాస్పిటల్ ఆవరణలో శుక్రవారం కీర్తి ఎంఏసీఎస్ లిమిటెడ్‌వారు 101 మంది వృద్ధులు, దివ్యాంగ విద్యార్థులు, అనాథలకు నూతన వస్త్రాలను బహూకరించారు. నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సిస్టర్ నిర్మల, సిస్టర్ ఫెలిస్టా క్రిస్మస్‌కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు.

### కొనసాగుతున్న గీతాజయంతి ఉత్సవాలు

నందిగామ: పట్టణంలోని రైతుపేట గీతా మందిరంలో గీతాజయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి విశేష పూజలు, ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కాంతులీనుతున్న క్రైస్తవ మందిరాలు



రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులో మెరిసిపోతున్న ఆర్సీఎం చర్చి



జగ్గయ్యపేట సెయింట్ ఆన్స్ హాస్పిటల్ వద్ద పశువుల పాక సెట్



కంచికచర్లలో చర్చి వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్లు

విద్యుద్దీపాలంకరణలో గండేపల్లి సీఎస్ఐ చర్చి



క్రిస్మస్ పండుగ సమీపిస్తుండటంతో జగ్గయ్యపేట, నందిగామ పట్టణాలతోపాటు ఆయా నియోజక వర్గాల్లోని గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. క్రైస్తవ ప్రార్థనా మందిరాలు విద్యుద్దీపాలంకరణలో కాంతులీనుతున్నాయి. గ్రామాల్లో పండుగ వాతావరణంతో కళకళలాడుతున్నాయి. గ్రామాల్లోని చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చర్చిలు, విద్యాసంస్థల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో విద్యుత్ కాంతులతో కూడిన స్టార్, ఫ్లెక్సీలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా చర్చిల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జీసెస్ జన్మవృత్తాంతాన్ని తెలిపే పశువుల పాకలు ప్రత్యేకాలంకరణగా నిలిచాయి. -కంచికచర్ల, జగ్గయ్యపేట, వీరులపాడు



వీరులపాడు: ప్రత్యేకాకర్షణగా ఏసు జన్మ వృత్తాంతం తెలిపే పశువుల పాక అలంకరణ



విద్యుత్ దీపాల వెలుగులో జగ్గయ్యపేటలోని యేసు తిరుహృదయ ఆర్సీఎం చర్చి



జగ్గయ్యపేటలో ముస్తాబైన సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చి

### నేడు ఉత్తర ద్వార దర్శనం

జగ్గయ్యపేట: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని తిరుమలగిరి, వేదాద్రి గ్రామాల్లో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి, యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయాల్లో స్వామివారు శనివారం ఉత్తరద్వారం నుంచి దర్శనమిస్తారని ఆలయ ఈవోలు దాసరి శ్రీరామవరప్రసాద రావు, జయప్రకాష్‌బాబు శుక్రవారం తెలిపారు. ఉదయం ఐదు గంటల నుంచి భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పిస్తామని వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రానుండటంతో ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

### ఆడుదాం ఆంధ్రా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంపీడీవో రమేష్ బాబు శుక్రవారం తెలిపారు. మండలంలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు 3,419మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ డబుల్స్ తదితర పోటీల్లో పాల్గొనేందుకు పురుషుల విభాగంలో 2,622 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, మహిళలు 797మంది తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. ఆయా సచివాలయాలకు క్రీడా పరికరాల కిట్‌లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

# శ్రీనివాస రామానుజన్‌కు ఘననివాళి

నందిగామ: మండలంలోని ఆయా పాఠశాలల్లో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లింగాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవ సందర్భంగా గణిత బోధనకు అవసరమైన అంకగణితం, రేఖాగణితం, త్రికోణమితి, క్షేత్రమితి వంటి వాటిని ప్రదర్శించారు. నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

**వాగ్దేవి కళాశాలలో..**

జగ్గయ్యపేట అర్బన్: గణిత మేధావి శ్రీనివాస రామానుజం జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక వాగ్దేవి కళాశాలలో ఘనంగా నిర్వహించారు.కేక్ కట్ చేశారు. ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో గణితంలో నూటికి నూరుశాతం మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వీరులపాడు మండలంలో..**

అల్లూరు(వీరులపాడు): మండలంలోని అల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



లింగాలపాడు పాఠశాలలో.. గణిత దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు గణితంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

**పెనుగంచిపోలు మండలంలో..**

వెంగనాయకునిపాలెం(పెనుగంచిప్రోలు): గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని స్థానిక యూపీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గణితం బోధించే ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హెచ్ఎం పుల్లాసాహెబ్ బహుమతులను అందజేశారు. టీచర్లు రామకుమారి, సచివాలయ సిబ్బంది షేక్ మస్తాన్, నాగరాజు పాల్గొన్నారు.

**విజ్ఞాన్ హైస్కూల్‌లో..**

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక విజ్ఞాన్ హైస్కూల్ శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులచే తయారుచేయబడిన వివిధ రకాల 150 గణిత నమూనాలను ప్రదర్శించారు. ప్రదర్శనను తిలకించేందుకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులకు గణిత నమూనాల పనితీరును వివరించారు.



రామానుజన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, విద్యార్థులు



వెంగనాయకునిపాలెం పాఠశాలలో...

## ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



సుబ్బాయగూడెం ప్రభుత్వ పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులచే కేక్ కట్ చేయించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మర్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధించిన నీతి, నిజాయితీ, ప్రేమ, క్షమాగుణం వంటి ఆదర్శాలను అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయురాలు సీహెచ్ కవిత ఆర్థికసహకారంతో పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథక సిబ్బంది, ఆయాకు నూతనవస్త్రాలు అందజేశారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

**కంచికచర్ల మండలంలో...**

కంచికచర్ల : క్రీస్తు అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని ఇమ్మాక్యులేటివ్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ మార్టియన్ సూచించారు. స్థానిక ఇమ్మాక్యులేటివ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా మార్టియన్ మాట్లాడుతూ క్రీస్తు ఆలోచన ప్రకారం మానవాళి నడుచుకోవాలన్నారు. దేవుని దృష్టిలో దీనత్వం కలిగి ఉండాలన్నారు. క్రీస్తు చూపిన మార్గంలో నడుచుకున్న వారికి ఏ కొదువ ఉండదని, ఆయన ఆలోచనలు మార్గదర్శంగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం క్రీస్తు పాటలకు విద్యార్థులు డాన్స్‌లు వేశారు. సిస్టర్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ రాజమణి, సిస్టర్లు అమల, సహాయ ఎలినాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బీజేటీ కళాశాలలో..**

కంచికచర్ల : మండలంలోని కీసర బీజేటీ డిగ్రీ కళాశాల, లసాల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జగ్గయ్యపేట విచారణ గురువులు గుడిశె జయరాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు అందరికీ ప్రభువని, క్రీస్తు పుట్టినరోజు వేడుకలు జరుపుకోవటం సంతోషదాయకమన్నారు. అనంతరం విద్యార్థులు క్రిస్మస్ పాటలకు డ్యాన్స్‌లు వేశారు. ప్రిన్సిపల్ ఫాదర్ పోలవరపు సుధీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆంతోని, థామస్, రాబర్ట్, బ్రిస్టన్, దుగ్గిరాల ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

**జగ్గయపేట పట్టణంలో..**

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం కన్నుల పండువగా జరిగాయి. ముఖ్య అతిథులుగా స్థానిక ఎల్ఈఎఫ్ చర్చి పాస్టర్ కె.శాంసన్ హాజరై ప్రసంగించారు. క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ తస్నీరు సుధారాణి, ప్రిన్సిపాల్ సుధీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కంచికచర్లలో క్రిస్మస్ గీతాలకు డాన్స్ చేస్తున్న ఇమ్మాక్యులేటివ్ కళాశాల విద్యార్థులు



పేటలో విజ్ఞాన్ స్కూల్‌లో క్రిస్మస్ కేక్‌ను కట్‌చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

### ఓటుహక్కును వినియోగించుకోవాలి



గొట్టుముక్కల(కంచికచర్ల) : అందరూ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా ముందస్తుగా ఈవీఎంల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలని కంచికచర్ల డీటీ షేక్ నాగుల్‌మీరా సూచించారు. మండలంలోని గొట్టుముక్కలలో ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈవీఎం, ఈఈ ప్యాడ్, నోటా తదితర అంశాలను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గుదే సరస్వతి మాజీ సర్పంచి గుదే రంగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తంగెళ్లమూడి రామారావు, వీఆర్వో రామారావు, నూతన ఓటర్లు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీమా నగదు అందజేత

గండేపల్లి(కంచికచర్ల): గండేపల్లిలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన పాలపర్తి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం కింద తొలివిడతగా రూ.10వేలను మంజూరు చేసింది. ఈమేరకు ఈ నగదును సర్పంచి బొక్కా రవి కుమార్ శుక్రవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. సర్పంచి రవికుమార్ మాట్లాడుతూ మృతుడు వెంకటేశ్వర్లు కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.5లక్షలు మంజూరవుతాయని చెప్పారు. తొలివిడతగా రూ.10వేలు అందజేశామని, మిగిలిన బీమా మొత్తం రూ.4.90లక్షలను త్వరలోనే బాధిత కుటుంబసభ్యులకు అందజేస్తామని వివరించారు. సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచి బెల్లంకొండ వెంకట సబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బీమా నగదు అందజేస్తున్న సర్పంచి రవికుమార్

### మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

రామవరప్పాడు: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తవుతాయని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. రూరల్ మండలం నిడమానూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన మాదక ద్రవ్యాలు- సోషల్ మీడియా దుర్వినియోగంపై' అవగాహన సదస్సు నిర్వహించారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించాలన్నారు. ప్రస్తుతం అవగాహన లోపంతో విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారన్నారు. నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ సరదాగా మొదలైన అలవాటు బానిసగా మారుస్తుందన్నారు. ఈ వ్యసనాల ప్రభావంతో తమ వ్యక్తిత్వం కోల్పోవడంతో పాటు సమాజంలో చులకనకు గురవుతారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. నవజీవన్ జోనల్ కో ఆర్డినేటర్ డి.విజయ రాణి, రజిత, ముబీనా బేగం పాల్గొన్నారు.

## ఆర్బీకేల్లో పంటనష్టం వివరాల జాబితాలు

పెనుగంచిప్రోలు: ఇటీవల సంభవించిన తుపాను కారణంగా పంటనష్టపోయిన రైతుల వివరాల జబితాను రైతుభరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) ప్రదర్శనకు ఉంచినట్లు ఏవో కె.రామసుబ్బారెడ్డి తెలిపారు. మండలంలో 916మంది రైతులకు చెందిన 1060 ఎకరాల వరిపంట దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. 33శాతం పంట దెబ్బతిన్న పొలాలను పరిశీలించి పంటనష్టాన్ని లెక్కించినట్లు చెప్పారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వివరించారు. ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ఉంచిన పంటనష్టం వివరాల జాబితాపై అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని రైతులను కోరారు.

**వత్సవాయి మండలంలో....**

తుపాను కారణంగా వత్సవాయి మండలంలోని ఆయా గ్రామాల్లో 142మంది రైతులకు చెందిన 122.6ఎకరాల వరిపంట దెబ్బతిన్నట్లు గుర్తించామని మండల వ్యవసాయాధికారి రవికుమార్ తెలిపారు. నష్టం వివరాలను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రైతులు పంటనష్టం జాబితాలను సరిచూసుకుని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తమదృష్టికి తీసుకోవాలని ఆయన కోరారు.



ఆర్బీకేలో ప్రదర్శించిన పంటనష్ట వివరాలను చూపిస్తున్న ఉద్యోగి

## భీమవరం సర్పంచిగా కారుపాటి మాధురి

వత్సవాయి(పెనుగంచిప్రోలు): వత్సవాయి మండలం భీమవరం గ్రామ నూతన సర్పంచిగా కారుపాటి మాధురి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం సర్పంచిగా ఉన్న భీమాల సుజాత వ్యక్తిగత కారణాలతో తన పదవికి ఇటీవల రాజీనామా చేయడంతో పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపసర్పంచిగా ఉన్న కారుపాటి మాధురి సర్పంచిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాధురిని నాయకులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చెన్నమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకుంట్ల వెంకటరెడ్డి, గున్నం రంగారెడ్డి, పెనుగొండ శ్రీనివాసరెడ్డి, చింతా వెంకటరెడ్డి, గంగిపోగు రమేష్, షేక్ నాగూర్ హుస్సేన్, షేక్ హుసేన్ పాల్గొన్నారు.



మాధురి

## విద్యుదాఘాతంతో మూడు గేదెల మృతి

గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు):విద్యుదాఘాతంతో మూడు పాడిగేదెలు మృతిచెందిన ఘటన గుమ్మడిదూర్రు గ్రామశివారులో మునేరు పక్కన చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మునేరు పక్కన గడ్డి మేస్తున్న గేదెలు విద్యుత్ స్తంభం వద్ద ఎర్త్ పైపునకు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన గేదెల విలువ సుమారుగా రూ.3లక్షల వరకు ఉంటుందని రైతు కంచేటి శ్రీనివాసరావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని విద్యుత్, పోలీస్ అధికారులు సందర్శించి వివరాలు సేకరించారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కె.అగ్రహారం(జగ్గయ్యపేట):కత్తిపీటతో గొంతు కోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం కె.అగ్రహారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అంగిరేకుల నాగార్జున కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా నాగార్జున ఫిట్స్‌తో బాధపడుతూ మానసికంగా ఇబ్బందిపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంటిలోని కత్తిపీటతో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.గమనించిన కుటుంబసభ్యులు అతన్ని పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. చిల్లకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.